సాక్షి పల్నాడు

బుధవారం ౹ 7 ౹ ఆగస్టు ౹ 2024



విజిలెన్స్ అధికారుల దాడి

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడులోగల రైస్‌మిల్లును విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు.



యూజీసీ కోఆర్డినేటర్‌గా అశోక్‌కుమార్

ఏఎన్‌యూ: ఏఎన్‌యూ యూజీసీ విభాగ కో–ఆర్డినేటర్‌గా అంబేడ్కర్ చైర్ అధ్యాపకులు ఆచార్య వై.అశోక్‌కుమార్ నియమితులయ్యారు. వీసీ ఉత్తర్వులు అందజేశారు.



యార్డుకు 40,747 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 40,747 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి 38,800 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

న్యూస్‌రీల్

ఆగని ఇసుక అక్రమ తవ్వకాలు

మల్లాదిలో టీడీపీ నాయకుల దందా
పోలీసులు ప్రేక్షక పాత్ర

అమరావతి: ప్రభుత్వం అధికారికంగా వైకుంఠపురం రీచ్ నుంచి ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వగా మండల పరిధిలోని మల్లాది ఇసుక రీచ్‌లో రాత్రిపూట అక్రమ రవాణా జరుగుతూనే ఉంది. మల్లాదిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని అధికారులు గుర్తించి రీచ్‌లోకి వాహనాలు వెళ్లకుండా దారిలో పెద్ద గండి తీయించారు. అయినప్పటికీ అధికారపార్టీకి చెందిన వారు రాత్రిపూట గండి పూడ్చి పొక్లెయిన్‌తో ఇసుక లోడింగ్ చేసి మరల తెల్లావారేటప్పటికీ మరలా యథావిధిగా గాడితీసి ఉంచుతున్నారు. సోమవారం రాత్రి సుమారు 20కి పైగా ట్రాక్టర్లు లోడ్ చేసుకుంటున్నాయని అందిన సమాచారం మేరకు రీచ్‌కు అమరావతి పోలీసులు వెళ్లారు. రీచ్‌లోకి వెళ్లిన పోలీసులు ఒక్క ట్రాక్టరు కూడా స్వాధీనం చేసుకోలేదు, ఎటువంటి కేసు నమోదు చేయలేదు. ఈ సంఘటనపై ఎస్ఐ నరసింహా మాట్లాడుతూ తాము రీచ్‌లోకి వెళ్లేటప్పటికి ట్రాక్టర్‌లతో సహా అందరూ పారిపోయారని, పొక్లెయినర్ కూడా కనబడలేదన్నారు. వాహనాలు వచ్చిన గుర్తులు కనిపించాయని తెలిపారు. అక్రమంగా రీచ్‌లలో ఇసుక తవ్వకాలు చేస్తున్న విషయం మైనింగ్ అధికారులకు, పోలీస్ అధికారులకు తెలిసిన చూసీచూడనట్లు వదిలేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఐటీఐ సీట్ల భర్తీకి మూడో విడత కౌన్సెలింగ్

మాచర్ల: పల్నాడు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ధ్రువపత్రాలతో ఐటీఐ.ఏపీ.జీఓ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు 27వ తేదీన తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు రావాలన్నారు. ఆగస్టు 29న కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. వివరాలకు ఐటీఐలో సంప్రదించాలని కోరారు.

సాగర్ అందాలు
చూతము రారండి

- గరిష్టస్థాయికి చేరిన నీటిమట్టం
- 22 గేట్ల ద్వారా నీరు విడుదల
- తరలివస్తున్న పర్యాటకులు



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయానికి కొత్తనీరు వచ్చి నీటిమట్టం గరిష్టస్థాయికి చేరటంతో జలాశయం కొత్త అందాలను సంతరించుకుంది. రెండు రోజులుగా సాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌లో జలాశయం మీదుగా లాంచీలో నాగార్జునకొండకు వెళ్లటం పర్యాటకులకు మరుపురాని అనుభూతిగా మిగిలిపోతుంది. దీంతో నిత్యం రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది పర్యాటకులు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో సాగర్ చుట్టుపక్కల సందర్శనీయ స్థలాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

గత ఆనవాళ్ల చిరునామా అనుపు



నాగార్జునసాగర్ ఏడు కిలో మీటర్ల దూరంలో అనుపు పర్యాటక కేంద్రం ఉంది. ఇక్కడ ఆనాటి నాగార్జున విశ్వ విద్యాలయం, ఇక్ష్వాకుల కాలం నాటి యాంపీ స్టేడియం ఆనవాళ్లు ఉన్నాయి. కృష్ణానది లోయలో లభించిన రంగనాథస్వామి దేవాలయాన్ని అదే రాతితో అనుపులోని కృష్ణానది తీరంలో నిర్మించటం విశేషం.

మనస్సు దోచే ఎత్తిపోతల జలపాతం



ఇది సాగర్ నుంచి మాచర్ల వెళ్లే రహదారిలో 14 కిలో మీటర్ల దూరంలో ఉంది. చంద్రవంక వాగుపై సహజసిద్ధంగా ఏర్పడిన జలపాతం ఇది. 70 అడుగుల పై నుంచి జాలువారే నీటి దృశ్యం పర్యాటకుల మనస్సు దోచుకుంటుంది. జలపాతం చూసేందుకు పెద్దలకు రూ.30, పిల్లలకు రూ.20 టికెట్ ధరను టూరిజంశాఖ వసూలు చేస్తుంది. ఇక్కడ పర్యాటకుల సౌకర్యార్థం రాత్రి బస చేసేందుకు 8 రూములు ఉన్నాయి. 5 ఏసీ రూమ్‌లు, మూడు నాన్‌ఏసీ రూములు ఉన్నాయి. ఏసీ రూమ్ ధర రూ.1,600, నాన్‌ఏసీ ధర రూ.1,000. ఇతర వివరాలకు ఎత్తిపోతల మేనేజర్ దత్తకుమార్ ఫోన్‌నెంబర్ 94414 53115లో సంప్రదించవచ్చు.

భక్తుల కోర్కెలు తీర్చే చల్లని తల్లి సాగర్‌మాత



విజయపురిసౌత్‌లోని కృష్ణానది తీరంలో వేంచేసియున్న సాగర్‌మాత దేవాలయానికి రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తుంటారు. భక్తుల కోర్కెలు తీర్చే చల్లని తల్లిగా సాగర్‌మాతకు విశిష్టమైన పేరు ఉంది. ఇక్కడ నెలకొల్పిన జపమాల క్షేత్రం రాష్ట్రంలోనే ప్రత్యేకతను నెలకొంది.

చరిత్రకు ప్రతిరూపం నాగార్జునకొండ మ్యూజియం



నాగార్జునకొండ ప్రపంచంలోనే రెండో ఐలాండ్ మ్యూజియం. నాగార్జునకొండ వెళ్లాలంటే విజయపురిసౌత్‌లోని లాంచీ స్టేషన్ నుంచి 14 కిలోమీటర్ల దూరం కృష్ణా నదిలో ప్రయాణం చేయాలి. కొండకు చేరుకునేందుకు లాంచీలో 45 నిమిషాల సమయం పడుతుంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు లాంచీలు పర్యాటకులకు అందుబాటులో ఉంటాయి. పెద్దలకు లాంచీ టికెట్టు ధర రూ.200, పిల్లలకు రూ.150, మ్యూజియం, మాన్యుమెంట్ సందర్శనకు రూ.30, మ్యూజియం సందర్శనకు 15 సంవత్సరాలలోపు చిన్నారులకు ఉచితం. విజ్ఞాన విహార యాత్రకు గ్రూపుగా వచ్చే విద్యార్థులకు లాంచీ టికెట్‌పై 15శాతం రాయితీ పర్యాటకశాఖ ఇస్తుంది. అలాగే పార్టీలకు, ఫంక్షన్‌లకు శాంతిసిరి గంటకు రూ.10,000, అగస్త్య లాంచీ గంటకు రూ.8,000 చెల్లించాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు లాంచీ స్టేషన్ ఫోన్ 9705188311 నెంబర్‌ను సంప్రదించవచ్చు.

ప్రధాన జలవిద్యుత్ కేంద్రం

ఇది సాగర్ ప్రధాన డ్యాం దిగువ ప్రాంతంలో ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ఉంటుంది. ఈ జలవిద్యుత్ కేంద్రాన్ని సాగర్ జెన్‌కో ఎస్‌ఈ అనుమతి తీసుకొని సందర్శించాల్సి ఉంటుంది.



విజయపురిసౌత్‌లోని లాడ్జిలు

మాతా సరోవర్ రిసార్ట్స్

ఈ అతిథి గృహంలో మొత్తం 40రూమ్‌లు ఉన్నాయి. 22 ఏసీ రూములు, 18 నాన్ ఏసీ రూములు ఉన్నాయి. ఇతర వివరాలకు 8500718552, 7901084959 నెంబర్‌లలో సంప్రదించవచ్చు.

నాగార్జున మోటెల్ కాంప్లెక్స్

ఈ అతిథి గృహంలో మొత్తం 19 రూములు ఉండగా 12 ఏసీ, 7 నాన్‌ఏసీ రూములు ఉన్నాయి. ఇతర వివరాలకు 9440968306, 9603242472 నెంబర్లలో సంప్రదించాలి.

ఫోన్ నంబర్లు

లాంచీస్టేషన్ -	9492674783, 9705188311
ఎత్తిపోతల	- 9441453115, 9494347946
విజయపురిసౌత్ పోలీస్‌స్టేషన్ -	08642-278219
సాగర్‌మాత దేవాలయం	-9581642488

క్లుప్తంగా

సమస్యల పరిష్కారం కోరుతూ వీఆర్ఏల ధర్నా



కారెంపూడి: వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల వీఆర్ఏలు కారెంపూడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్‌కు తమ సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. వీఆర్ఏల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ వీఆర్ఏలతో నైట్ వాచ్‌మెన్, అటెండర్ డ్యూటీలు చేయిస్తున్నారని ఇతర పనులు కూడా చేయిస్తున్నారని అలాంటి అదనపు పనులు చేయించడం ఆపి వేయాలన్నారు. జిల్లాలో ఖాళీగా నైట్ వాచ్‌మెన్, అటెండర్ పోస్టులు భర్తీ చేయాలని వాటిలో వీఆర్ఏలను నియమించాలని అలాగే అర్హత ఉన్న వారికి వీఆర్ఓలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల సంఘం అధ్యక్షుడు కోటేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి కిషోర్, మండలంలో పని చేస్తున వీఆర్ఏలు పాల్గొన్నారు.

రాజుపాలెంలో 52.2 మి.మీ వర్షపాతం నమోదు

నరసరావుపేట: జిల్లాలో ఒక్క వెల్దుర్తి మినహా మిగిలిన 27 మండలాల్లో వర్షం కురిసింది. మొత్తం 505.6 మి.మీ వర్షం నమోదైంది. అత్యధికంగా రాజుపాలెం మండలంలో 52.2 మి.మీ వర్షం పడింది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు 24గంటల వ్యవధిలో పడిన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. నరసరావుపేటలో 37.6 మి.మీ వర్షం పడగా, రొంపిచర్లలో 47.6 మి.మీ, మాచర్లలో 10.4, దుర్గిలో 4.4, రెంటచింతలలో 22.6, గురజాలలో 26.4, దాచేపల్లిలో 4.6, కారంపూడిలో 34.4, పిడుగురాళ్లలో 17.6, మాచవరంలో 10.6, బెల్లంకొండలో 42.2, అచ్చంపేటలో 23.0, క్రోసూరులో 8.6, అమరావతిలో 40.6, పెదకూరపాడులో 2.0, సత్తెనపల్లిలో 5.4, నకరికల్లులో 2.8, బొల్లాపల్లిలో 25.8, వినుకొండలో 10.2, నూజెండ్లలో 14.2, శావల్యాపురంలో 13.6, ఈపూరులో 18.6, ముప్పాళ్లలో 8.4, నాదెండ్లలో 9.2, చిలకలూరిపేటలో 3.2, యడ్లపాడులో 9.9 మి.మీటర్ల వర్షం నమోదైంది.

ముంపు గ్రామాలకు పోటెత్తుతున్న వరద

- రెండో రోజు కృష్ణా నదికి భారీగా వచ్చి చేరుతున్న వరద నీరు
- అప్రమత్తమైన అధికారులు
- సురక్షిత ప్రాంతాలకు తరలింపు



కోళ్లూరు వద్ద కృష్ణమ్మ ప్రవాహం

బెల్లంకొండ: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి రెండు రోజులుగా వరద నీరు భారీగా వచ్చి చేరుతుంది. సోమవారం ఉదయం నుంచి ప్రారంభమైన వరద ప్రవాహం మంగళవారం భారీగా పెరగడంతో గ్రామాలు పూర్తిగా నీట మునిగాయి. ప్రాజెక్టు పరిధిలో ప్రస్తుతం దాదాపుగా 22 టీఎంసీల వరకూ నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టులో నీటిని నిల్వతో బెల్లంకొండ మండలంలోని ముంపు గ్రామాలైన పులిచింతల, గొల్లపేట, కోళ్లూరు, బోదనం, చిట్యాల గ్రామాలు పూర్తిగా నీట మునిగాయి. ఎమ్మాజీగూడెం గ్రామం వరకూ బుధవారం ఉదయం లోగా వరద నీరు చేరే అవకాశం ఉంది. రెవెన్యూ, పోలీసు అధికారులు ఎమ్మాజీగూడెం ప్రజలను అప్రమత్తం చేశారు. ముంపు గ్రామాలలో ఉన్న పశువుల కాపరులు ముంపు ప్రాంతాన్ని ఖాళీ చేసి, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా నిలిపేందుకు పనిచేయాలి

ఏపీ రాష్ట్ర చైల్డ్ ప్రొటెక్షన్ రైట్స్ సభ్యురాలు పద్మావతి



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష చేస్తున్న బి.పద్మావతి

నరసరావుపేట: జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా నిలిపేందుకు సంబంధిత శాఖలు సమన్వయం, సహకారం, శ్రద్ధాసక్తులతో పనిచేయాలని ఏపీ రాష్ట్ర చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ సభ్యురాలు బి.పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళల అక్రమ రవాణా, డ్రగ్స్ నియంత్రణపై తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, జాయింట్ యాక్షన్ ప్లాన్ అమలు కోసం జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాల విద్యాశాఖపై సమీక్షిస్తూ జిల్లాలో ఉన్న పాఠశాలలో ప్రహరీ క్లబ్‌లు, ఫ్రెండ్లీ టీచర్ల వివరాలపై నివేదిక అందజేయాలన్నారు. పిల్లలు డ్రగ్స్‌కు బానిసలు కాకుండా తీసుకున్న యాక్షన్ ప్లాన్, బడి మానేసిన పిల్లల వివరాలు సేకరించేందుకు గల కారణాలు తెలుసుకొని అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఫోక్సో కేసులు నమోదు, అనంతరం తీసుకున్న చర్యలపై నివేదిక రూపొందించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖపై సమీక్షిస్తూ జిల్లాలో డీ-అడిక్షన్ సెంటర్లు, వాటిలో నమోదైన కేసులు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్‌కు రిఫర్ చేశారా? వైద్యశాలలో మానసిక వైద్యులు ఉన్నారా అని ప్రశ్నించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.రవి స్పందిస్తూ మానసిక వైద్యులు అందుబాటులో ఉన్నారని, ప్రతి శనివారం డీ-అడిక్షన్ సెంటర్ నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఎనిమిది కేసులు నమోదు కాగా అందులో గంజాయి-5, నిద్ర మాత్రలకు అలవాటు పడినవారు ముగ్గురిని గుర్తించామన్నారు. వారిపై నింతర నిఘా ఉంచాలని పద్మావతి సూచించారు. పిల్లలు, వారి తల్లిదండ్రులకు డ్రగ్స్ వల్ల జరిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి అధికారి పిల్లల హక్కులు, జి.ఓ-139, 131లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. ఫోక్సో కేసుల్లో నష్టపరిహారం కోసం దరఖాస్తు చేయించాలని సూచించారు. గురుకుల పాఠశాలలో విద్యార్థులు పాము కాటుకు గురికాకుండా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సాంఘిక సంక్షేమ, ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాల్లో ఫ్రెండ్లీ టీచర్లను నియమించాలని, చట్టాలపై పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని స్పెషల్ జువనైల్ ప్రొటెక్షన్ యూనిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎక్కడా చట్టాల అమలులో నిబంధనలు అతిక్రమించకుండా చూడాలని అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, అదనపు అడ్మిన్ ఎస్పీ ఆర్.రాఘవేంద్ర, ఆర్డీవో పి.సరోజిని, ఐసీడీఎస్ పీడీ ఉమారాణి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం సాంఘిక సంక్షేమ, బీసీ, సంక్షేమ, ట్రైబల్ వెల్ఫేర్, ఏపీ రెసిడెన్షియల్, గురుకులాల వార్డెన్లతో సమావేశం నిర్వహించి బాలల హక్కుల పరిరక్షణ చట్టాల అమలుపై పలు సూచనలు, సలహాలు అందజేశారు.

24 నుంచి అద్దంకిలో శతావధానం



అద్దంకి: సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మల చారిటబుల్ ట్రస్టు ద్వారా నారాయణం బాల సుబ్రహ్మణ్యంచే నాలుగో శతావధానం అద్దంకిలో ఈ నెల 24, 25, 26 తేదీల్లో నిర్వహించనున్నట్లు సాహితీ మిత్రమండలి గౌరవాధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి చెప్పారు. ఈ కార్యక్రమాన్ని పట్టణంలోని చిన్నిశాంతయ్య, పిచ్చమ్మ గార్ల సేవాసదన్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పట్టణంలో మంగళవారం కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారణాశి రఘురామశర్మ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో శతావధానంలో పేరుగాంచిన నారాయణం బాలసుబ్రహ్మణ్యం మన అద్దంకి వాసి కావడం, అద్దంకికి లభించిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. శతావధానం పద్యానికి సంబంధించిన ఒక పద్యక్రీడ అని, 350కి పైగా అష్టావధానాలు, మూడు శతావధానాలు చేసిన కవి, పండితునిచే నిర్వహించనున్న శతావధానం అద్దంకి సాహితీ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని డాక్టర్ దేవపాలన అన్నారు. పద్యం పుట్టిన గడ్డపైన, పద్యం పాతబడ్డది అనేవారికి, పద్యం నిత్యనూతనం అని తన శతావధానం ద్వారా నారాయణం బాల సుబ్రహ్మణ్యం నిరూపిస్తున్నారని సృజన సంస్థ అధ్యక్షుడు గాడేపల్లి దివాకర దత్తు ప్రశంసించారు. శతావధాని నారాయణం తమ సమకాలికులవడం తమ అదృష్టమని రోటరీ సంస్థ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య వెల్లడించారు. కార్యదర్శి కె.వి. పోలిరెడ్డి, సందిరెడ్డి శ్రీనివాసరావు, కొలలపూడి శ్రీనివాసరావు, లక్కరాజు శ్రీనివాసరావు, లక్కరాజు విశ్వమోహన్, బాచిన పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పంద్రాగస్టు వేడుకలకు ఏఎన్‌యూ విద్యార్థులు



ఏఎన్‌యూ: ఈనెల 15న ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య దిన వేడుకలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఇద్దరు ఎన్‌సీసీ వలంటీర్లు ఎంపికయ్యారు. వర్సిటీ పరిధిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ చదువుతున్న బుర్ర దివ్యశ్రీ, ఫార్మా డీ చదువుతున్న ఎస్.రేవంత్ సాయి ఈ వేడుకలకు ఎంపికయ్యారు. వీరిని మంగళవారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు తన కార్యాలయంలో అభినందించారు. వీసీ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం విద్యార్థులు సామాజిక సేవలో అన్ని వర్గాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 20 మంది పాల్గొంటుండగా వారిలో ఏఎన్‌యూ నుంచి ఇద్దరు ఉండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వి.దివ్యతేజోమూర్తి, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానం పుణ్యకార్యం



లక్ష్మీపురం: అవయవదానం పుణ్యకార్యమని కస్టమ్స్, జీఎస్టీ విశాఖపట్నం జోన్ చీఫ్ కమిషనర్ సంజయ్ రాఠీ అన్నారు. స్థానిక గుంటూరు జీఎస్టీ కార్యాలయంలో అంగ్దాన్ జన్ జాగృత అభియాన్, అవయవ దానం దినోత్సవంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంజయ్‌రాఠీ మాట్లాడుతూ అవయవాల దానంతో ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. ఇటువంటి కార్యక్రమం నిర్వహించిన గుంటూరు జీఎస్టీ అధికారులను ఆయన అభినందించారు. జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అవయవదానం ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. స్పెక్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి అవయవ దానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం సీజీఎస్టీ గుంటూరు కమిషనరేట్, సీజీఎస్టీ తిరుపతి కమిషనర్, కస్టమ్స్ ప్రివెంటివ్ కమిషనరేట్, విజయవాడకు చెందిన 200 మంది అధికారులు పాల్గొని అవయవదానంపై ప్రతిజ్ఞ చేశారు. జీఎస్టీ అధికారులు బి.లక్ష్మీనారాయణ, ఉపేంద్ర ధ్రువ్ పాల్గొన్నారు.

మంగళగిరిలో నేడు జాతీయ చేనేత దినోత్సవం

మంగళగిరి: పట్టణంలోని ఎన్ఆర్ఐ జంక్షన్‌లోని నేతన్న సర్కిల్‌లో బుధవారం జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా చేనేత ఏడీఏ వనజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌తోపాటు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి , పలువురు చేనేత జౌళి సహాయ అధికారులు పాల్గొంటారని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతి చెందిన వెంకట్రావు

పిడుగురాళ్ల: అప్పుల బాధతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ మంగళవారం వ్యక్తి మృతి చెందాడు. వివరాల ప్రకారం.. కుమ్మరిపాలెంకు చెందిన నవ్వూలూరి వెంకట్రావు (38) అప్పుల బాధ తట్టుకోలేక మూడు రోజుల కిందట గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రెండు రోజుల నుంచి పిడుగురాళ్ల పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. వెంకట్రావు ఆటో డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఇటీవల సుమారు రూ.4 లక్షలు అప్పులు కావటంతో అప్పుల వాళ్లు ఒత్తిడి చేయటంతో మనస్తాపానికి గురయ్యాడు. వెంకట్రావుకు కూడా సుమారు రూ.మూడు లక్షల వరకు అప్పులు రావాల్సి ఉంది. అయితే వారు ఇవ్వకపోటంతో వెంకట్రావు అప్పులు తీర్చేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. ఈ క్రమంలోనే తన స్నేహితులతో కలిసి మద్యం సేవించిన వెంకట్రావు స్నేహితులందరిని ఇంటికి వెళ్లమని పంపించేశాడు. అనంతరం గడ్డిమందును మద్యంలో కలుపుకొని తాగాడు. స్థానికులు గమనించి వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స అందించినప్పటికి పరిస్థితి విషయంగా ఉండటంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

దాడికి పాల్పడిన టీడీపీ నాయకుడిపై కేసు నమోదు

ముప్పాళ్ల: మండలంలోని తొండపి గ్రామానికి చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ ముజావర్ సైదాపై దాడికి పాల్పడిన టీడీపీ నాయకుడిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం సత్తెనపల్లి నుంచి భార్యతో కలిసి ముప్పాళ్ల వస్తున్న సైదాపై పీబీసీ కాల్వ వద్ద వాహనాన్ని ఆపి అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రాయిడి హనుమంతరావు దాడికి పాల్పడ్డాడు. ఆ సంఘటనతో తీవ్ర మనస్థాపానికి గురై చనిపోతానంటూ సైదా ఇల్లు విడిచి వెళ్లిన సంగతి తెలిసిందే. భార్య ఫిర్యాదు మేర విచారణ చేపట్టిన పోలీసులు మొబైల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా సైదా కర్నూలులో ఉన్నట్లు గుర్తించారు. సైదా కర్నూలులో ఉన్నట్లు తెలియడంతో కుటుంబసభ్యులు, బంధువులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ మేర పోలీసులు కుటుంబసభ్యులతో కలిసి కర్నూలు వెళ్లి మంగళవారం ఇంటికి తీసుకువచ్చారు. సంఘటన జరిగిన తీరుపై సైదా నుంచి పోలీసులు పూర్తి వివరాలు సేకరించారు. దాడికి పాల్పడిన టీడీపీ నాయకుడు రాయిడి హనుమంతరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై పీ.హజరతయ్య మంగళవారం తెలిపారు.

8న ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు గుజ్జనగుండ్ల సర్కిల్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 8న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రఘు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సువర్ణ కుటీర్ డెవలపర్స్ ప్రైవేటు లిమిటెడ్, పేటీఎం, టెక్‌బీఎం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, జయలక్ష్మి ఆటోమొబైల్స్‌లలో ఉద్యోగాల భర్తీ కోసం టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి జరగనున్న ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలని, వివరాలకు 98668 22697, 87907 90762 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంతో నిరంతర ఆదాయం

ప్రకృతి వ్యవసాయం జిల్లా యాంకర్ కె రామచంద్రం



రైతులకు సలహాలు, సూచనలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

యడ్లపాడు: ప్రకృతి వ్యవసాయంతో నిరంతర ఆదాయం సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా యాంకర్ కె రామచంద్రం చెప్పారు. యడ్లపాడు మండలంలోని పలు గ్రామాలను ప్రకృతి వ్యవసాయ విభాగ జిల్లా అధికారులు మంగళవారం సందర్శించారు. చెంఘీజ్‌ఖాన్‌పేట, కొత్తసాలస, ఉన్నవ గ్రామాల్లో ప్రకృతి విధానంతో సాగవుతున్న పంటలను స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. ఆయా పంటల్లో ఎదురయ్యే సమస్యలు చేపడుతున్న పరిష్కారాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులకు పలు సలహాలు సూచనలు అందజేశారు. పలు పంటల విధానం వలన ఒకే పెట్టుబడితో ఒక ఎకరంలో 5 ఎకరాల దిగుబడులను సాధించి గణనీయ ఆదాయాన్ని సాధించవచ్చన్నారు. ముఖ్యంగా నిరంతర ఆదాయం పొందడంతోపాటు నాణ్యమైన ఉత్పత్తులను వినియోగదారులకు అందించవచ్చన్నారు. అన్నింటికి మించి జీవవైవిధ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం విభాగం డీపీఎం కె అమలకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులందరినీ స్వయం సహాయక సంఘాల మాదిరిగా గ్రూపులుగా తయారుచేసి ఆయా సంఘాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. వారి ఉత్పత్తుల నాణ్యతను పరీక్షించి పీజీఎస్ (పార్టిస్పేటరీ గ్యారంటీ సిస్టమ్) సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. తమ ఉత్పత్తుల్లో ఎలాంటి రసాయనిక, పురుగుమందుల అవశేషాలు లేవని ధృవీకరించి ఇచ్చే ఈ సర్టిఫికెట్‌తో అంతర్జాతీయ స్థాయి ఆర్గానిక్ ఉత్పత్తుల మార్కెట్‌లో అధిక రేట్లకు విక్రయించుకోవచ్చన్నారు. ఈ ఏడాది ప్రకృతి వ్యవసాయం ఏ-గ్రేడ్, ఏటీఎం, తదితర నమూనాలలో సాగు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ ఏడాది జిల్లాలో ప్రకృతి వ్యవసాయం 52 వేల సాగు లక్ష్యంగా నిర్దేశించుకోగా, ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 49 వేల ఎకరాలలో రైతులు సాగు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం ప్రేమరాజ్, ఎన్ఎస్ఏలు మల్లేశ్వరి, విజయకుమారి, సౌజన్య, నందకుమార్, అప్పలరాజు, మాస్టర్ ట్రైనర్ బేబీరాణి, స్థానిక సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విత్తనాల కోసం రైతుల బారులు



నరసరావుపేట ప్రకాష్‌నగర్‌లోని డీలర్ గోడౌన్ వద్ద బారులు తీరిన రైతులు

- జేజీఎల్ రకానికి అధిక డిమాండ్
- ఎక్కువ ధరకు విక్రయిస్తున్న వ్యాపారులు
- ఇతర రకాలు అంటగట్టే ప్రయత్నం

నరసరావుపేట: నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లు ఎత్తేశారు. రేపోమాపో కుడికాలువకు సాగునీరు విడుదల చేయనున్నారు. మాగాణి రైతుల్లో సాగు చేయాలనే ఉత్సాహం పెల్లుబికింది. వరి ధాన్యం పండించేందుకు కావాల్సిన అనువైన విత్తనాల కోసం రైతులు వేట మొదలు పెట్టారు. పట్టణంలోని పలు విత్తనాల షాపులు రైతులతో నాలుగురోజుల నుంచి కిక్కిరిసి పోతున్నాయి. ప్రకాష్‌నగర్‌లోని చిన్నయ్య అండ్ సన్స్ విత్తనాల డీలర్ వద్దకు నరసరావుపేట, వినుకొండ నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున వస్తున్నారు. వర్షాన్ని లెక్క చేయకుండా ఆయా షాపుల వద్ద పడిగాపులు పడుతున్నారు. మహిళలు కూడా రావటం విశేషం. దీనిని ఆసరాగా చేసుకున్న డీలర్లు, వ్యాపారులు ధరలు పెంచి విక్రయిస్తున్నారు. దీంతోపాటు రైతులు అడుగుతున్న జేజీఎల్ రకం విత్తనాలు ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్ సృష్టించారు. 30 కిలోల బస్తా రూ.2వేలకు పైగా విక్రయిస్తున్నారు. రైతులు అడుగుతున్న జేజీఎల్ రకానికి బదులుగా ఇతర రకాలు సోనా, ఎన్ఎల్ఆర్, బీపీటి, ఎంటీయూ రకాలు తీసుకోవాలని రైతులకు వ్యాపారులు సూచిస్తున్నారు. అయితే పండిన తర్వాత జేజీఎల్ రకానికి ఉన్న డిమాండ్‌ను గుర్తుచేసుకొని అదే రకం తమకు కావాలంటూ పట్టుబడుతున్నారు. వ్యవసాయ అధికారులు అప్పుడప్పుడు విత్తనాల షాపులను తనిఖీచేసి బ్లాక్ మార్కెట్ చేయరాదని హెచ్చరిస్తున్నా షాపుల యజమానులు, డీలర్లు అదేపనికి పాల్పడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆలిండియా ఆదివాసి సంఘీభావ సదస్సును జయప్రదం చేయండి

పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న చిలుకా చంద్రశేఖర్, నాయకులు

సత్తెనపల్లి: హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 9,10 తేదీల్లో జరగబోయే ఆలిండియా ఆదివాసి సంఘీభావ సదస్సును జయప్రదం చేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని తాలూకా సెంటర్‌లో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద వివిధ రాజకీయపార్టీల, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆలిండియా ఆదివాసి సంఘీభావ సదస్సు కరపత్రాలను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్ పాల్, పీడీఎం నాయకుడు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ సదస్సును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నల్లబాటి రామారావు, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల: దండకారణ్యం, మధ్య భారతంలో జరుగుతున్న కేంద్ర ప్రభుత్వ దాడులను ఖండిస్తూ ఆదివాసీ కుటుంబాలకు సంఘీభావంగా హైదరాబాద్‌లో ఈ నెల 9,10 తేదీలలో జరిగే ఆల్ ఇండియా సదస్సును జయప్రదం చేయాలని పీడీఎం రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని లెనిన్‌నగర్ స్థూపం సెంటర్‌లో సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, ఎంసీపీఐ జిల్లా అధ్యక్షులు ఓర్సు కృష్ణ, సీపీఐ పట్టణ కార్యదర్శి కృష్ణనాయక్, నాయకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాగి తీగ చోరీ ముఠా అరెస్టు

- వివరాలు వెల్లడించిన సీఐ క్రిష్టయ్య
- రూ.4.5 లక్షల విలువైన రాగి, అల్యూమినియం తీగ సీజ్



సీజ్ చేసిన రాగి, అల్యూమినియం వైరు, పక్కన నిందితులు

అద్దంకి: పగలు సుబాబుల్ తోటల్లో పనులు చేసుకుంటూ రాత్రిళ్లు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగి, అల్యూమినియం తీగ చోరీ చేసే ముఠాను పోలీసులు పట్టుకొని కటకటాల్లోకి నెట్టారు. మంగళవారం సీఐ క్రిష్టయ్య స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన పి.చెంచురామయ్య, యాటగిరి రామయ్య అనే యువకులు, మరికొందరితో కలసి ముఠాగా ఏర్పడి రాత్రిళ్లు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగి తీగను చోరీ చేస్తుంటారు. వీరంతా కలసి అద్దంకి, జె.పంగులూరు, కొరిశపాడు, బల్లికురవ, సంతమాగులూరు, చినగంజాం, వేటపాలెం, మార్టూరు మండలాల్లోని 39 కేసుల్లో ఆయా మండలాల్లోని పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగి, అల్యూమినియం తీగను చోరీ చేసినట్లు విచారణలో ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. బాపట్ల జిల్లా ఎస్పీ, చీరాల డీఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ నాగరాజు, మరో ఐదుగురు బృందంగా ఏర్పడి నిందితులను పట్టుకున్నట్లు చెప్పారు. వీరంతా రాత్రిళ్లు షికారు కనే నెపంతో పొలాల్లోకి వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి తీగను చోరీ చేస్తున్నట్లు చెప్పారు. తేలికగా డబ్బు సంపాదించడానికి ఇదో మార్గంగా వారు ఎంచుకున్నట్లు సీఐ చెప్పారు. మండలంలోని శింగరకొండపాలెం గ్రామం వద్ద మంగళవారం వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.4.5 లక్షల విలువైన తీగను రికవరీ చేసినట్లు చెప్పారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ నాగరాజు, సిబ్బందిని సీఐ అభినందించారు.

ప్రకాశంపై గుంటూరు భారీ స్కోరు

మంగళగిరి: మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నవులూరు అమరావతి క్రికెట్ టౌన్ షిప్‌లో కల ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఏసీఏ సీనియర్ మెన్ మల్టీ డే ఇంటర్ డిస్ట్రిక్ మ్యాచ్‌లో గుంటూరు జట్టు చెలరేగిపోవడంతో భారీ స్కోర్ సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుంటూరు జట్టు నిర్ణీత 90 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 372 పరుగులు సాధించింది. జట్టు బ్యాట్స్‌మెన్ కె.మహీప్ 274 బాల్స్‌లో 5 సిక్స్‌లతో 17 ఫోర్లతో చెలరేగిపోయి 274 పరుగులు సాధించాడు. మరో బ్యాట్స్‌మెన్ సూర్యవంశీ 9 ఫోర్లు, 1 సిక్స్‌తో 78 పరుగులు చేశాడు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో గుంటూరు జట్టు 372 పరుగులు భారీస్కోర్ సాధించింది.